## క్లుప్తంగా

### కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోనీ అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

మహానంది: పారిశుధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వద్దని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి తెలిపారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మంజులవాణి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యంపై పక్షోత్సవాల కార్యక్రమం జరుగుతుందన్నారు. పారిశుధ్య పనులు చేయడంతో పాటు డ్రైనేజీలు శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలతో పాటు నిర్ణీత వ్యవధిలో ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నటరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జక్రియా పాల్గొన్నారు.

### హెల్మెట్ తప్పకుండా ధరించండి



హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

ఆత్మకూరు: ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అడ్వకేట్లు సూచించారు. శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి కోర్టు కాంప్లెక్స్ నుంచి గౌడ్ సెంటర్ వరకు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వాడకపోతే ప్రాణాలకే ప్రమాదమని, ఇంట్లో నుంచి బయలుదేరే సమయంలో కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని అడ్వకేట్లు ప్రజలకు సూచించారు.

### డాక్టరేట్ ప్రదానం



తలత్ ఫర్వీన్

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు తలత్ పర్వీన్‌కు హైదరాబాద్ మౌలాన అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ హెచ్ అలీమ్ బాషా పర్యవేక్షణలో భౌతిక శాస్త్రంలో అబ్జర్వేషన్ అండ్ కంపారిజన్స్ ఆఫ్ వేరియేషన్ ఇన్ ఇన్స్టాబిలిటీ ఇన్డిసిస్ ఇన్ డిఫరెంట్ రీజన్స్ ఆఫ్ ఇండియా త్రూ రేడియో సోన్ డే డేటా అంశంపై చేసిన పరిశోధనకు గానూ తనకు డాక్టర్ లభించినట్లు తలత్ పర్వీన్ శుక్రవారం తెలిపారు. కాగా తలత్ పర్వీన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సునీత, అధ్యాపకులు అభినందించారు.


### పంటలను కాపాడుకోవాలి



మునగ పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి చందన

కొత్తపల్లి: మునగ పంటలను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖాధికారి కె.చందన రైతులకు సూచించారు. మండలంలోని ముసలిమడుగు గ్రామ సమీపంలో దెబ్బతిన్న మునగ పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎక్కువ వర్షాల కారణంగా మునగపంటలలో తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత పొలాల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాపరాక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. ఆమె వెంట వీఏఏ రవీంద్ర నాయక్ ఉన్నారు.

### మౌలాలిస్వామి ఊరేగింపు



గాజులపల్లెలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లె మెట్ట వద్ద కొలువైన శ్రీ మౌలాలిస్వామి జార్తల వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పీర్ల మకానానికి చేరుకుని మౌలాలిస్వామి వారిని దర్శించుకుని పూల సూచికలు, కానుకలు సమర్పించారు.

# నిండా నిర్లక్ష్యం..

- గోవులను రోడ్లపై వదిలేస్తున్న యజమానులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

'ఎవరికేమైతే మాకేమిటి' అనే చందంగా వ్యవహరిస్తున్నారు కొందరు గోవుల యజమానులు. వాటి ఫలాలు మాత్రమే అనుభవిస్తూ.. బాగోలను పట్టించుకోకుండా గాలికొదిలేయడంతో అవి రోడ్లపై విచ్చల విడిగా సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యజమానులను దండించి గోవులను రోడ్లపై నుంచి తరలించాల్సిన అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వాహనదారులు, దుకాణ దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



ఆత్మకూరు రూరల్: అసలే అంతంత మాత్రమే వెడల్పు ఉన్న రోడ్లు.. ఆపై కిక్కిరిసిన జన సంచారం .. అందులోనూ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆత్మకూరు పట్టణంలోని కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిపై గోవులను వాటి యజమానులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. అవి రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలబడటం, హాయిగా పడుకోవడంతో పాటు అప్పుడప్పుడూ పోట్లాడుకుంటూ ఉండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

**వ్యాపార వనరుగా..**

పట్టణంలోని భారత్ పెట్రోలు బంక్, గౌడు సెంటర్, స్టేట్ బ్యాంక్ ఎదురుగా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వాల్ పోస్టర్లు, చిత్తు కాగితాలు తింటూ జీవిస్తున్నాయి. కొన్ని గోవులకు కుంకుమ, పసుపు బొట్లు ఉండటంతో వాటిని దేవుడి ఆవులుగా భావించి దుకాణ దారులు తినుబండారాలు అందజేస్తున్నారు. ఇదో వ్యాపార కిటుకుగా భావించిన యజమానులు అదే పనిగా గోవులను కొనుగోలు చేసి రోడ్లపై వదిలేస్తూ వ్యాపార వనరుగా మార్చుకుంటున్నారనే విమర్శలున్నాయి.

**వాహనాలకు అడ్డంగా..**

ఒక్కోసారి గోవులు వాహనాలకు సడన్‌గా అడ్డు వస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. గోవుల సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా ఇటు పోలీసులు కానీ.. అటు మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా యజమానుకు కౌన్సిలింగ్ ఇచ్చి గోవులను రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులు

### పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ గౌరీబాయి

జూపాడుబంగ్లా: పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గౌరీబాయి సూచించారు. శుక్రవారం తంగడంచ, మండ్లెం గ్రామాల్లో ఆమె రైతులతో మాట్లాడారు. ఐదు ఎకరాల్లోపు పొలం ఉండి నీటివసతి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వారి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఫొటోతో ఉపాధిహామీ పథకం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి ఉత్సవం నిర్వహించారు.

## అధిక దిగుబడులు సాధించండి



రైతులకు సలహాలిస్తున్న డీఆర్సీ ఏఓ హేమలత

జూపాడుబంగ్లా: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని నంద్యాల డీఆర్సీ ఏఓ హేమలత, జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం తరిగోపుల గ్రామంలో పొలంబడి రైతుల ఎంపికపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటను సాగుచేసిన రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడుకోవాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వల్ల ధాన్యం విషతుల్యమవుతుందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించటంతో పాటు యంత్రాలను వినియోగించటం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. వీటితో పాటు ఏటేటా పంట మార్పిడి పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం 25 ఎకరాల్లో మొక్కజొన్న పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించేందుకు 30 మంది రైతులతో కమిటీని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రైతుసేవాకేంద్రం వీహెచ్‌ఏ బాబు పాల్గొన్నారు.

### గిరిజనులకు రుణాలు ఇప్పించాలి

మహానంది: చెంచులక్ష్మి గూడెంలో 30 మందికి ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారని, అవసరమైన వారికి రుణాలు ఇప్పించాలని గిరిజనులు కోరారు. గిరిజన చెంచు గూడెంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మహానంది సర్పంచ్ చలంచలం శిరీష మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గూడెంలో మరణించిన ఏడుగురికి మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఐటీడీఏ ఏపీఎం జోహార్‌బాషా మాట్లాడుతూ లైవ్‌స్టాక్ పథకం ద్వారా చెంచులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శివప్రసాద్, వీఏఏ వసుంధర, వీహెచ్‌ఏ రాజేశ్వరి, డీఏ భ్రమరాంబ పాల్గొన్నారు.

### 20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తపల్లి: 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ బాబాఫకృద్దీన్ శుక్రవారం తెలిపారు. సింగరాజు పల్లె గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చేరుకుని సోదాలు చేయగా రవికుమార్ వద్ద 20 మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పగిడ్యాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం పగిడ్యాలలోని 1 నుంచి 7 అంగన్‌వాడీ కేంద్రాల్లో భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పలు సూచనలిచ్చారు. ఆడపిల్లల సంరక్షణలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

### తల్లిదండ్రుల చెంతకు విద్యార్థిని

మహానంది: ఇటీవల అదృశ్యమైన బొల్లవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని పోలీసులు తల్లిదండ్రు చెంతకు చేర్చారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, బాలిక ఆచూకీ కనుగొని శుక్రవారం తహసీల్దార్ రామచంద్రుడు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. మహానందికి చెందిన సానికె బాలరాజు(58)కు భార్య కొంత కాలం క్రితమే మృతిచెందింది. బాలరాజుకు కూడా ఇటీవల కనుచూపు మందగించింది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది నీళ్లలో కళ్లాపి పౌడర్ కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని కడమలకాల్వ, ఏ.కోడూరు, జీసీ పాలెం గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించినట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు.

### మోస్తరు వర్షం

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. గువ్వలకుంట్ల, వీరాపురం, లింగాపురం, శివపురం, బావాపురం, నందికుంట గ్రామాలతో పాటు మండల కేంద్రంలో వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి.

## బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

వెలుగోడు: అనారోగ్యంతో మరణించిన మోతుకూరు గ్రామానికి చెందిన స్వామినాయుడు కుటుంబానికి రూ.2లక్షల బీమా సొమ్ము అందజేసినట్లు కెనరాబ్యాంకు వెలుగోడు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ సూర్యదేవనాయక్ తెలిపారు. శుక్రవారం నగదును మృతుడి భార్య సుమిత్రమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా చేసుకుంటే ఆపద సమయంలో ఆర్థిక తోడ్పాడు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### స్వగ్రామానికి హైకోర్టు జడ్జీ



హైకోర్టు న్యాయమూర్తి ఎన్. హరినాథ్‌రెడ్డి

పగిడ్యాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్. హరినాథ్‌రెడ్డి శుక్రవారం రాత్రి స్వగ్రామం తూర్పు ప్రాతకోటకు చేరుకున్నారు. కోర్టుకు రెండు రోజులు సెలవులు ఉన్నందున కుటుంబ సభ్యులతో గడిపేందుకు స్వగ్రామానికి వచ్చినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

### రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం పులివెందులకు చెందిన లింగాల విజయకుమార్ రెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షణకులు నాగరాజుకి అందజేశారు.

### మల్లన్న సన్నిధిలో కార్మిక శాఖ మంత్రి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

## వైద్య సేవలు భేష్

మిడుతూరు: ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ద్వారా గ్రామీణులకు అందుతున్న వైద్య సేవలు బాగున్నాయని డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తలముడిపి ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రాన్ని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. గ్రామంలోని ప్రాథమిక (తెలుగు, ఉర్దూ మీడియం), జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని ప్రసవాల వివరాలను డాక్టర్ మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. బాలింతలు, గర్భిణులను వారికి అందుతు న్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

### భయం.. భయం

మహానంది: స్థానిక గోశాల, అన్నప్రసాద భవనం, పార్వతీపురం, పెద్దనంది, ఈశ్వర్‌నగర్ కాలనీల్లో కొద్ది రోజులుగా చిరుత సంచరిస్తుండటంతో చీకటి పడితే చాలు భక్తులు, స్థానికులు బయటికి వచ్చేందుకు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా జేసీ, ఆర్‌డీఓ, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించేందుకు వచ్చి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా దేవస్థానం అధికారులు తమకేమీ పట్టనట్టు ఉన్నారు. దీంతో మహానందిలోని పెద్దనంది ముందు నుంచి గరుడనంది వరకు వెళ్లే దారిలో అంధకారం నెలకొంది.

## తాగునీటి పథకాలను శుభ్రం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ భీమశంకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: తాగునీటి పథకాలను శుభ్రం చేయించాలని స్వచ్ఛభారత్, జలజీవన్‌మిషన్ జిల్లా కోఆర్డినేటర్ భీమశంకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో సర్పంచ్ వంగల లక్ష్మీదేవి అధ్యక్షతన డయేరియా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను పక్షం రోజులకోసారి శుభ్రం చేయించి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడరు చల్లించాలన్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం, మురుగునీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశ, ఆరోగ్యసిబ్బంది నిత్యం వీధుల్లో తిరుగుతూ విషజ్వరాలు, డయేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్సలు అందేలా చూడాలన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులు లీకేజీ అయి నీరు కలుషితం అవుతున్నట్లయితే వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో తాగునీటి శాఖ ఏఈ నాగేంద్ర, కార్యదర్శి శాంతయ్య, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడి వర్కర్లు పాల్గొన్నారు.

## కామేశ్వరీదేవికి చీర సారె



అమ్మవారికి చీర, సారె సమర్పిస్తున్న భక్తులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన కామేశ్వరీదేవికి నందికొట్కూరుకు చెందిన భక్తులు శుక్రవారం చీర, సారె సమర్పించారు. నందికొట్కూరుకు చెందిన ఎం.రమేష్, లక్ష్మి, సుబ్బారావు, పుష్పకుమారిల ఆధ్వర్యంలో కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

శ్రీశైలం: మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐ ప్రసాదరావు ఎస్‌ఐలకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా, కొనుగోలు, విక్రయాలు, నిల్వ, స్మగ్లింగ్ తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ మాదక్ పదార్థ్ నిషేధ్ అసూచన కేంద్రం మానస్ పేరిట టోల్ ఫ్రీ నంబర్ 1933, ఇ–మెయిల్ ఐ.డి info. ncbmanas@gov.in వెబ్‌సైట్ ncbmanas.gov.in ప్రారంభించిందన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి తదితర మత్తు పదార్థాల సాగుపై ఎవరైనా టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని ప్రజలకు చెప్పాలన్నారు. బాధితులు, కౌన్సిలింగ్, రీహాబిలిటేషన్ సెంటర్ల సమాచారం కూడా వెబ్‌సైట్‌లో ఉంటునే విషయాన్ని తెలియాజేయాలన్నారు.

## విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం.ఆర్.నాయక్

ఆత్మకూరు: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం.ఆర్.నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక ధనుంజయ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి కేంద్ర బడ్జెట్‌లో 3 శాతమే నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. యూజీసీకి నిధులు తగ్గించి ఉన్నత విద్యను వ్యాపారం చేసే కుట్ర జరుగుతోందన్నారు. కొఠారి కమిషన్ ప్రతిపాదనలను అమలు చేసి రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న విద్యావసతి దీవెన విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సాయి, ప్రశాంత్, అంజి, నాగమ్మ, రాణి, మల్లేశ్వరి, ఆశ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకరణలో వాసవీ మాత



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

వెలుగోడు: స్థానిక వాసవీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పూలతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. లలితా సహస్రపారాయణం చదివి వినిపించారు. పురోహితులు నరసరామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

● మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారిని శుక్రవారం ఉదయం శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకం, (అమ్మవార్లకు సారె, ఒడిబియ్యం) తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వన దేవతలు గజ్జల పాపమ్మ, వసుదేవమ్మ, రాములమ్మ, లక్ష్మమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## అమరవీరుల జ్ఞాపకాలను మరవకూడదు



కార్గిల్ సంకల్పయాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నందికొట్కూరు: అమరవీరుల త్యాగాలను మరవకూడదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి పటేల్ సెంటర్ వరకు కార్గిల్ విజయ సంకల్పయాత్ర ర్యాలీ నిర్వహించారు. మన దేశ భూభాగాన్ని కాపాడే క్రమంలో సైన్యం ప్రాణాలను అర్పించిందన్నారు. వారి ప్రాణత్యాగాలను స్మరించుకోవడం ప్రతిఒక్కరి ధర్మమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, రామచంద్రుడు, అశ్వినికుమార్, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శంకర్, ఆరుద్రస్వామి, అశోక్‌వర్ధన్‌రెడ్డి, బాలయ్య, శ్రీకాంత్, మధుకుమార్, రవి, అభి, శ్రీధర్‌యాదవ్, సత్యమయ్య పాల్గొన్నారు.

### అమర వీరులకు ఘన నివాళి

ఆత్మకూరు: కార్గిల్ అమర వీరులకు ఘన నివాళులర్పించారు. మాజీ సైనికుల సంఘం పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌శెట్టి, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులను స్మరించుకుంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల సేవలు మరువలేనివన్నారు.

● శ్రీశైలంప్రాజెక్ట్: కార్గిల్ దివస్ సందర్భంగా శుక్రవారం రాత్రి సున్నిపెంటలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కొద్ది సేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వర్లు, వేముల శ్రీను, గెల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌వీఎస్ మల్లికార్జున, నల్లబోతుల మల్లికార్జున, అడుసుమల్లి సుబ్బారావు, మైలా శ్రీను, గాదం మల్లేస్, కొట్టె సురేంద్ర, ఎన్.రూపస్, జనార్దన్, డి.వి.నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు ప్రభాకర్‌శెట్టి

### పట్టణ ప్రజల దాహం తీర్చండి

నందికొట్కూరు: పట్టణ ప్రజల దాహం తీర్చాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఓర్వకలు ప్రాంతంలో నిర్మించే పరిశ్రమలకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణానది శ్రీశైలం బ్యాక్‌వాటర్ తరలించే క్రమంలో చేపడుతున్న పైప్‌లైన్ పనులను శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణానది బ్యాక్ వాటర్ చుట్టూ ఉన్న మండల, పట్టణ ప్రజలకు తాగు, సాగు నీరు ఇవ్వకుండా సుదూర ప్రాంతాలకు తరలించడం తగదన్నారు. త్వరలోనే ప్రజలను సమీకరించి పైపులైన్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట ఏపీ రైతు సంఘం నాయకులు నాయుడు, అశోక్, పాండు, సోమన్న, రామకృష్ణ, మస్తాన్‌వలి ఉన్నారు.



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు